PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు

8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 124 | 19 బుధవారం ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari



## స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు

# కీలక నిర్ణయం

అమరావతి,ఆగస్ట్18 (ప్రజా సీమ ):

స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. అలానే పట్టణ ప్రాంతాల్లో బీసీలకు 33.1 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల హామీ మేరకు బీసీలకు రిజర్వేషన్లను పెంచే అంశంపై ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు చేసిన నేపథ్యంలో కేబినెట్ నిర్ణయంకు ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలను అక్టోబర్‌లోగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.16,500 కోట్ల నిధులు నష్టపోకుండా ఉండేందుకు ఎన్నికలను సకాలంలో నిర్వహించాల్సిన అవసరాన్ని కేబినెట్ పరిగణనలోకి తీసుకుంది. బిసిలకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, మేయర్ల ఎన్నికలకు ప్రత్యక్ష పద్ధతిలో వెళ్లాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది ....మిగతా 2 లో...

**గ్రామీణ ప్రాంతాల్లో 34, పట్టణ ప్రాంతాల్లో 33.1 శాతం రిజర్వేషన్లు**
**పద్ధతిలో వెళ్లాలని నిర్ణయం**
**ఆర్థికసంఘం నిధులు నష్టపోకుండా సకాలంలో ఎన్నికల నిర్వహణ**
**దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై కేబినేట్‌లో చర్చ**





## స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం

**బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం**
**ఎన్నికల హామీ మాత్రమే కాదు.... తమ రాజకీయ సిద్ధాంతం**
**ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకొనే రోజు ఇది**
**టిడిపి వచ్చిన తరవాతనే ఎందరో బిసి నేతలుగా ఎదిగారు**
**అసెంబ్లీ చర్చలో సిఎం చంద్రబాబు నాయుడు**

అమరావతి,ఆగస్ట్18 (ప్రజా సీమ ):

బీసీలకు అండగా ఉంటామని తమ ప్రభుత్వం మరోసారి రుజువు చేసిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు అంశంపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం ఇది అని చెప్పారు. ఇది ఎన్నికల హామీ మాత్రమే కాదని.. తమ రాజకీయ సిద్ధాంతమన్నారు. హామీ ఇవ్వడమే కాకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయమని.. ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకొనే రోజు ఇది అని చెప్పారు. తెదేపా రాకముందు రాజకీయ అధికారం కొన్ని వర్గాలకే పరిమితమైంది. ఎన్టీఆర్ వచ్చాకే బీసీలకు ఆ అవకాశం దక్కింది. మా పార్టీలో ఎంతోమంది బీసీలు నేతలుగా ఎదిగారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, దేవేందర్‌గౌడ్ ఉన్నత స్థాయికి చేరుకున్నారు.

...మిగతా 2 లో...

## కీలక పదవిపై తొలిసారి స్పందించిన నాగబాబు

పిఠాపురం : (ప్రజా సీమ ):

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు రాష్ట్ర కేబినెట్ హోదా కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో నాగబాబు తొలిసారి స్పందించారు. తనకు కేబినెట్ హోదా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, తన సోదరుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు నాగబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ గ్రీన్ సొసైటీ ఛైర్మన్‌గా రాష్ట్ర భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. మొక్కలు నాటడం తన జీవితంలో భాగమని, ఈ పదవిని గొప్ప బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తానని నాగబాబు స్పష్టం చేశారు.



# నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

## ప్రధాని మోడీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్

న్యూఢిల్లీ,ఆగస్ట్18 (ప్రజా సీమ ):



ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కనవ్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.

## కెబిఆర్ పార్క్ చుట్టూ

# వన్‌వే అమలు

- ఏడాదిన్నరపాటు అమలు కానున్న ఆంక్షలు
- ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణం
- ట్రాఫిక్ సూచనలను పాటించాలన్న సజ్జన్నార్

హైదరాబాద్,ఆగస్ట్18 (ప్రజా సీమ ):



హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ అమల్లోకి వచ్చింది. 18న అమల్లోకి వచ్చిన ఈ ప్రక్రియ నుంచి ఏడాదిన్నరపాటు కేబీఆర్ పార్క్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాల్సి ఉంటుంది. హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టిన 7 ఫ్లై ఓవర్లు, 7 అండర్ పాస్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకే వన్ వే ట్రాఫిక్ అమలు చేస్తున్నట్టు సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. ...మిగతా 2 లో...

# అమరావతికి పిలుపు.

## చంద్రబాబును కలిసిన ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ

పిఠాపురం (ప్రజా సీమ ):

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ అమరావతిలో ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును కలిశారు. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన పార్టీ వ్యవహారాలు, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పార్టీ అధినాయకత్వంపై తన విధేయతను మరోసారి స్పష్టం చేశారు. "మా నాయకుడు చంద్రబాబు గారి మాటే శిరోధార్యం. పార్టీ అధినాయకత్వం తీసుకునే ప్రతి నిర్ణయానికి కట్టుబడి ఉంటాను. తెలుగుదేశం పార్టీ బలోపేతమే నా లక్ష్యం" అని పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయాలను గౌరవిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని వర్మ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కార్యకర్తలకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఇటీవల పిఠాపురం టీడీపీ వ్యవహారాలపై పలు రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్న నేపథ్యంలో వర్మ చంద్రబాబును కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలోనూ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని వర్మ స్పష్టం చేసిన సందర్భాలు ఉన్నాయి. పార్టీ అధినేతతో భేటీ అనంతరం వర్మ చేసిన విధేయత ప్రకటనతో పిఠాపురం టీడీపీలో ఇకపై సమన్వయంతో ముందుకు సాగే సంకేతాలు వెలువడుతున్నాయి.





# హరీష్ రావు కాదు..

# అబద్ధాల రావు

హైదరాబాద్,ఆగస్ట్18( (ప్రజా సీమ ):):

మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు కాదు ఆయన అబద్దాల రావు అని ఎద్దేవా చేశారు. 22ఏ లో ఆయన కొండను తవ్వి ఎలుకను పట్టారని.. దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారని సెటైర్లు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్ వేదికగా మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గతంలో సాఫ్ట్ కాపీ అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తప్పు జరిగిందని తామే గుర్తించామని అన్నారు. ఆయన ఎత్తు పెరగడం కాదని.. విమర్శలు చేసే ముందు బుర్ర కూడా ఉపయోగించాలని మంత్రి వ్యగ్యంగా మాట్లాడారు. ఎవరికీ అన్యాయం జరగనివ్వోమని అన్నారు. ప్రభుత్వ భూములు కాకపోతే కచ్చితంగా వాటిని 22ఏ నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో మాదిరిగా తాము బుకాయించడం లేదని చెప్పారు. కేంద్రం, ఎన్నికల సంఘం, బీఆర్ఎస్ కలిసి ఓట్లను తొలగించే కుట్రను చేస్తున్నాయని.. వారి పప్పులు ఉడకనివ్వబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.

ప్రజాసీమ

# స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు ఆమోదం...

మొదటిపేజీ తరువాయి

విశాఖలో అక్షత్ గ్రీన్‌టెక్ సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంట్, డేటా సెంటర్ల ప్రతిపాదనలకు ఆమోదం ఇచ్చింది
తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడలో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి.. పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికలు, పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, మౌలిక వసతులకు సంబంధించిన పలు అంశాలపై కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్లు, చైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే డిప్యూటీ మేయర్లు, డిప్యూటీ చైర్మన్ల విషయంలో పాత విధానాన్ని కొనసాగిస్తూ.. ఒక్కరికి మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించింది. పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించి కూడా కేబినెట్ పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే 12 గిగావాట్ల సిలికాన్ ఇంగాట్, వేఫర్ ఎ÷–లాంట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో అక్షత్ గ్రీన్‌టెక్ ఆధ్వర్యంలో సోలార్ సెల్, మాడ్యూల్ ఎ÷–లాంట్, డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలి తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడ ప్రాంతాల్లో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంధన రంగంలో హైబ్రిడ్, సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. అమరావతి రైల్వే లైన్ కోసం భూసేకరణ, ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన అంశంపైనా నిర్ణయం తీసుకుంది. హ్యామ్ మోడల్‌లో రూ.7,469.46 కోట్లతో రోడ్లు, పార్కుల అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించింది. రాష్ట్రంలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాల విషయంలోనూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించేందుకు ఆమోదం తెలిపింది. బీసీ విద్యార్థుల కోసం జేఈఈ, నీట్ పరీక్షల శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉన్నత విద్యా రంగానికి సంబంధించి ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ ఏర్పాటు చేసే బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రంలోని ఉన్నత విద్యా వ్యవస్థలో మరిన్ని మార్పులకు మార్గం సుగమం కానుంది. ఏపీఎస్‌బీసీఎల్‌కు రూ.5 వేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ రుణం ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అవయవ మార్పిడికి సంబంధించిన ట్రాన్స్‌ఎ÷–లాంటేషన్ బిల్లుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్–2 నీటి ప్రాజెక్టులపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. ఇదిలావుంటే ద్రవ్యోల్బణం పెరుగుతున్నందున ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర మంత్రివర్గం అంజెడా అంశాలు ముగిశాక వివిధ పరిణామాలపై సీఎం చర్చించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని మంత్రులకు సూచించారు. అక్టోబర్‌లోగా స్థానిక ఎన్నికలు జరగకుంటే రూ.12150 కోట్లు అర్బన్ లోకల్ బాడీ నిధులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. న్యాయ పరిధిలో 23 మున్సిపాలిటీల విలీన ప్రక్రియను తర్వాత చూసుకుందామని.. ముందైతే అన్నింటిలోనూ ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. మద్యం బ్రాండ్‌లు పిచ్చి పిచ్చి
పేర్లతో రాకుండా కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అక్రమార్కులు కంటైనర్లలో ఇసుక తరలింపునకు యత్నిస్తుంటే కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం

మొదటిపేజీ తరువాయి

1995లో బీసీలకు ఉన్న 20 శాతం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచామన్నారు. తెదేపా పాలనలో బీసీల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. కులవృత్తులు, చేతివృత్తులకు అండగా నిలిచాం. బీసీలకు ఆదరణ కింద 341 పరికరాలను 90 శాతం రాయితీతో ఇచ్చాం. బీసీల కోసం రూ.32 వేల కోట్లు ఖర్చు చేశాం. వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు ఇస్తున్నాం. నేతన్న సేవ కింద ప్రతి కుటుంబానికి రూ.25 వేలు అందజేస్తున్నాం. మత్స్యకారులకు ప్రతి దశలోనూ అండగా ఉంటున్నాం. 217 జీవో రద్దు చేసి మత్స్యకారులను ఆదుకున్నాం. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణుల జీతాలను రూ.25వేలకు పెంచాం. బీసీలు సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే రూ.95వేల రాయితీ ఇస్తున్నాం. బీసీలకు విద్య, నైపుణ్యం, ఉపాధి, వ్యాపార, రాజకీయ ప్రాతినిధ్యం ఇస్తాం. మేం తెచ్చిన బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు. రాజ్యాంగ పరిమితులు పాటిస్తూనే సామాజిక న్యాయం చేస్తున్నాం. సమాజంలో ప్రతి వర్గానికీ అవకాశం కల్పించాలనేది మా లక్ష్యం' అని చంద్రబాబు అన్నారు. అందుకే బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు నాయుడు అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం కేవలం ఎన్నికల హామీ కాదని, అది తమ రాజకీయ సిద్దాంతంలో భాగమని చంద్రబాబు స్పష్టం చేశారు. హామీలు ఇవ్వడంతోనే ఆగిపోకుండా వాటిని అమలు చేసి చూపిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం బిసిలకు రిజర్వేషన్ల విషయంలో చేసిన అన్యాయన్ని సరిచేయడానికి ప్రత్యేక క్యాబినెట్ పెట్టి నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చెప్పారు. 2024 ఎన్నికల్లో ఈ స్థాయి గెలుపుకు కారణం బిసిల వల్లేనని చెప్పుకొచ్చారు. 94శాతం స్ట్రయిక్ రేట్ 57శాతం ఓట్లు వచ్చాయంటే అది బిసిల వల్ల, నాయకత్వంపై ఉన్న నమ్మకం వల్ల మాత్రమేనని పేర్కొన్నారు. బిసిలకు న్యాయం చేయాలని తాను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలు ఎన్నికలకు ముందే నిర్ణయం తీసుకున్నామన్నారు.
బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారు. ఈ రెండు అంశాలకు సంబంధించిన నిబంధనలు చట్టాల్లో ఉన్నాయని వివరించారు. అర్బన్ లోకల్ బాడీల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే విధానం ఉంటుందని చంద్రబాబు వెల్లడించారు. రాబోయే రోజుల్లో 28 జిల్లా పరిషత్‌లు ఏర్పడే అవకాశం ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లను కాపాడటంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు అండగా ఉంటుందనే విషయాన్ని ఈ నిర్ణయం మరోసారి నిరూపించిందన్నారు. టీడీపీ ఆవిర్భావానికి ముందు రాజకీయాల్లో ఫ్యూడలిజం ఉండేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలనే ఆలోచనతో ముందుకెళ్లారని తెలిపారు. ఎర్రం నాయుడు, కేఈ కృష్ణమూర్తి, అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడు, తెలంగాణలో
దేవేందర్ గౌడ్ వంటి నాయకులను రాజకీయంగా ముందుకు తీసుకురావడంలో ఎన్టీఆర్ కీలక పాత్ర పోషించారని చంద్రబాబు పేర్కొన్నారు. 1995లో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చామని చంద్రబాబు గుర్తుచేశారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత బీసీలకు అన్యాయం జరిగిందని అన్నారు. అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో ఎంఎస్ 176ను హైకోర్టులో సవాలు చేయగా.. న్యాయస్థానం దానిని కొట్టివేసిందని, అయితే ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించలేదని చంద్రబాబు విమర్శించారు. 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 24.5 శాతానికి తగ్గించారని వ్యాఖ్యానించారు. బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వడంలో టీడీపీకి ముందు, టీడీపీ తర్వాత అనే చర్చ జరగాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అన్నారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చాక బీసీలకు అన్యాయం జరిగింది. రిజర్వేషన్ల పెంపుపై కొందరు హైకోర్టుకు వెళ్లారు. ఉన్నత న్యాయస్థానం ఆ జీవోను కొట్టేసినా గత ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లలేదు. బీసీలకు ద్రోహం చేయడంలో వైకాపా నాయకుడు జగన్ నంబర్ వన్. 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారు. దీంతో వైకాపా హయాంలో 16,800 మంది బీసీ నేతలు నష్టపోయారు. ఎంపీటీసీ నాగరాజును కర్నూలు ఎంపీగా చేసిన ఘనత ఎన్డీయేది. వడ్డెర మహిళ దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చాం అని అన్నారు. వైకాపా హయాంలో అనేక మంది బీసీ నేతలను వేధించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడిని ఇబ్బంది పెట్టారు. తెదేపాకు మద్దతుగా ఉన్నారని అనేక మంది బీసీలను హత్య చేశారు. ఆయా వర్గాలపై కిరాతకంగా ప్రవర్తించారు. 56 బీసీ కార్పొరేషన్ల పేరిట నాటకాలు ఆడారు. డీఎస్సీపై 350 కేసులు వేసి ఇబ్బందులు పెట్టారు. ఉపాధ్యాయ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టుకు వెళ్తే చరిత్రహీనులుగా మిగులుతారు.. జాగ్రత్త.

------

# ప్రైవేట్ ట్రావెల్ బస్సును టిప్పర్ ఢీ

## ప్రయాణికులకు తప్పిన ప్రమాదం.. డ్రైవర్ నిద్రమత్తే కారణమని అనుమానం

పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్:

కడప--చెన్నై ప్రధాన రహదారిపై మోడల్ స్కూల్ దగ్గరలోనే నర్సరీ ప్లాంట్ వద్దా హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సును టిప్పర్ ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. టిప్పర్ డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అదృష్టవశాత్తూ బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు.






# బీసీలకు 34 శాతం రిజర్వేషన్ హర్షనీయం

## ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదములు

## టిడిపి యువ నాయకులు రాజుగుంట నరసింహ

చిట్వేలి,(ప్రజా సీమ)




బీసీలకు 34 శాతం రిజర్వేషన్ పునరుద్ధరించినందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మరియు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి కి, వెనుకబడిన వర్గాల (బి సి) తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలుగుదేశం యువ నాయకులు రాజు కుంట నరసింహ తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాల (బీసీ) హక్కులను పరిరక్షిస్తూ, 34 శాతం రిజర్వేషన్ల ను అమలు చేసేందుకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలుగుదేశం నాయకులు రాజు కుంట నరసింహ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారుబీసీల రాజకీయ, సామాజిక సాధికారతకు నిరంతరం కృషి చేస్తున్న ప్రజా నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, బీసీలను ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీకి, రాష్ట్ర ప్రగతికి వెన్నెముకగా భావించి, వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరియు సంక్షేమాన్ని కాపాడేందుకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించడంపై మీ దార్శనికతకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, వెనుకబడిన వర్గాల హక్కులు, ఆకాంక్షల తరపున నిలబడి, కూటమి ప్రభుత్వంలో వారికి తగిన న్యాయం జరిగేలా మద్దతుగా నిలిచినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు. అలాగే ఐటీ, విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ కి, యువతరం ఆలోచనలతో బీసీ వర్గాల విద్యా, ఉపాధి మరియు రాజకీయ భవిష్యత్తు కోసం ప్రభుత్వం తరపున నిరంతరం కృషి చేస్తున్నందుకు ధన్యవాదాలు. స్థానిక సంస్థలు మరియు ఇతర కీలక రంగాలలో 34 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణ అనేది కేవలం ఒక నిర్ణయం మాత్రమే కాదని, ఇది బీసీల ఆత్మగౌరవానికి దక్కిన గొప్ప విజయమని భావిస్తున్నామనీ, ఈ నిర్ణయం ద్వారా బీసీ వర్గాల్లోని ఎంతోమంది నాయకులకు సామాజికంగా, రాజకీయంగా ముందడుగు వేసేందుకు గొప్ప అవకాశం లభించిందనీ, కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ ప్రజానుకూల నిర్ణయం బీసీ వర్గాల ఆత్మగౌరవాన్ని పెంచే ఉందని రాజు కుంట నరసింహ అన్నారు.

# బిఆర్ఎస్‌తో పోలిస్తే రెండింతలుగా భూ ఆక్రమణలు

మొదటిపేజీ తరువాయి

గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండింతలు పెరిగిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు, చివరకు ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని ఈటల మండిపడ్డారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక భూమాఫియాకు అప్పగించే కుట్ర ఉందని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసినప్పటికీ భూములను లాక్కునే ప్రభుత్వాల విధానంలో ఎలాంటి మార్పు రాలేదని ఈటల విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే భూములను సెటిల్‌మెంట్ చేసుకుంటోందని ఆరోపించారు. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఇలాంటి భూ దందాల ద్వారా వచ్చినవేనంటూ ఈటల సంచలన ఆరోపణలు చేశారు. గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ ద్వారా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని ఈటల పేర్కొన్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. పేదలు, రైతులకు అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ముకాయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూ అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం కొనసాగుతుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అయితే, ఈ సమావేశంలో ఈటల చేసిన ఆరోపణలపై ప్రభుత్వం లేదా సంబంధిత వర్గాల స్పందన వెలువడాల్సి ఉంది.

# కెబిఆర్ పార్క్ చుట్టూ వన్‌వే అమలు

మొదటిపేజీ తరువాయి



పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, రోడ్ నెం.45 మీదుగా ఐటీ కారిడార్‌కు వెళ్లే వాహనదారులు.. కేబీఆర్ పార్క్ జంక్షన్ నుంచి బసవతారకం, ఫిల్మ్ నగర్ మీదుగా రోడ్ నెం.45 చేరుకొని అక్కడి నుంచి ఐటీ కారిడార్‌కు చేరుకోవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. హెచ్– సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.1300 కోట్ల వ్యయంతో కేబీఆర్ పార్కు చుట్టూ వీటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ పార్కు చుట్టూ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు పార్కు చుట్టూ వన్ వే చేశామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో చాలామంది ప్రజలు సంతోషిస్తున్నారని తెలిపారు. 'కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు అందరికి ధన్యవాదములు. అగ్రసేన్ చౌరస్తా రోడ్ నం 45, చెక్ పోస్ట్, వెంకటగిరి దగ్గర కాస్త ఇబ్బంది కలిగింది. డ్రోన్స్ ద్వారా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇంకా కొన్ని చోట్ల సూచికలు పెట్టాల్సి ఉంది. సాంకేతికతను ఉపయోగించి ఇంకా ఎటువంటి మార్పులు చేయాలో చూస్తాం. ముఖ్యంగా కొంత మంది సూచనలు పాటించకుండా వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు ఇచ్చే సూచనలు పాటిస్తూ వాహనదారులు ముందుకు వెళ్లాలని సూచిస్తున్నామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

మొదటిపేజీ తరువాయి

మీ భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి విడిపించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్ట్రార్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని హరీశ్‌రావు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ పని చేయకపోయినా మా జనతా గ్యారేజ్ అంటే తెలంగాణ భవన్ తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని హరీశ్‌రావు అన్నారు. మూసిపరివాహక ప్రాంతంలోని ఇండ్లను హైడ్రా కూలగొట్టే ప్రయత్నం చేసినప్పుడు జనతా గ్యారేజ్ తలుపు తట్టారని, అప్పుడు వాళ్లకు న్యాయం చేశామని అన్నారు. అదేవిధంగా నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని జాబితాలో ఉందని.. మరి సీఎం ఎక్కడ మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాల నుంచి తొలగించిన భూముల లిస్టును పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని.. తప్పు వారు చేసి అధికారులపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులూ జాగ్రత్త.. మీరు తప్పు చేస్తే రేపు మీరే బలవుతారు. మీ కమీషన్ల కోసం పెన్ను పోటుతో ప్రజల జీవితాలను బలి చేయొద్దు. రేపు ఎప్పుడు అసెంబ్లీ పెట్టినా నిషేధిత భూములపై ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నిలదీస్తుంది.. ప్రజలకు అండగా ఉంటుంది.

# సంపాదకీయం


## ముష్కరుల కదలికలపై కన్నేయాలి!

గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన వెనక అల్‌ఖైదా అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి కూడా దీనిని గుర్తించింది. భారత్‌లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను పురోత్సహిస్తోందని అంటున్నారు. ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయ పడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఎన్‌ఎస్‌జీ, ఎన్‌ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ది చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు. ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్‌లో ఇప్పుడున్న 3శాతం మంది హిందువుల ను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవవల పాక్‌కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్‌కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. కేవలం ఆపరేషన్ సిందూర్‌తో ఇది సమిసి పోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు కూడా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు. పుణెలో టిసిఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్దతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదులతో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండడం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి పోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్క ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూ పోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళుతున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి. దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్నాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

# అభినవ వాల్మీకి మహాకవి తులసీదాస్

### -రామచరిత మానస్, హనుమాన్ చాలీసా కావ్యాలను రచించిన రామ భక్తుడు
### -నేడు ఆయన జయంతి

(ప్రజా సీమ)





తులసీదాసును హిందూ ఆధ్యాత్మిక గురువుగా పిలుస్తారు. ఈ మహాకవి రామచరిత మానస్, హనుమాన్ చాలీసా సహా ఎన్నో కావ్యాలను రచించారు.ప్రకారం, ప్రతి సంవత్సరం శ్రావణ మాసం శుక్ల పక్షంలోని ఏడవ రోజున తులసీదాసు పుట్టినరోజు జరుపుకొంటారు. తులసీదాస్ గొప్ప కవి. రామచరిత మానస్‌ను సృష్టించిన ఘనత ఆయనది. మహాకవి తులసీదాస్ తన జీవితమంతా రామ భక్తుడిగానే గడిపాడు. రామచరితమానస్, దోహావళి, కవితావళి, గీతావళి, వినయ పీఠిక, జానకీ మంగళ్, రామలాల నహచాచు. రామాంజ ప్రసన్న, పార్వతి మంగళ్, కృష్ణ గీతావళి, హుమాన్ బాహుక, సంకట మోచనస వైరాగ్య సందీపిని, హనుమాన్ చాలీసా వంటి గొప్ప కావ్యాలను తులసీదాస్ రాశారు. ఈ కావ్యాలన్నీ ఆయనను గొప్ప కవిని చేశాయి. తులసీదాస్‌ను ఆధ్యాత్మిక గురువుగా కూడా పరిగణిస్తారు. తులసీదాసు తండ్రి ఆత్మారాముడు, తల్లి హులసీ. తులసీదాసు జన్మించినప్పుడు అయిదు సంవత్సరాల బాలుడిలా కనిపించాడట. తల్లితండ్రులు అతని విలక్షణ రూపానికి భయపడి తమ ఇంటి దాసి మునియాకు పెంచుకోవడానికి ఇచ్చారు. తరువాత కొద్దికాలానికి ఆతనిని పెంచుకొన్న మునియా దాసి కూడా చనిపోయింది. అపుడు బాబా నరహరిదాసు అనే సాధువు ఆ అనాథ బాలుడైన తులసీదాసుని పెంచి విద్య నేర్పారు. తరువాత శేష సనాతనుడనే శ్రేష్ఠుని దగ్గర తులసీదాసు వేద, వేదాంగాలు అభ్యసించాడు. తులసీదాసు అనాథ బాలుడైనా ఆతని రూప, గుణ, శీల, స్వభావ, విద్వత్తులకు ముగ్ధుడై ఒక కులీన బ్రాహ్మణడతనికి తన కూతురునిచ్చి వివాహం చేశాడు. తన భార్య రత్నావళి అంటే తులసీదాసు ఎంతో ప్రేమ చూపించేవాడు.ఒకసారి తులసీదాసు ఇంట్లో లేనప్పుడు ఆయన భార్య రత్నావళి పుట్టింటికి వెళ్లింది. ఈ విషయం తెలియగానే తులసీదాసు ఆమెను కలుసుకునేందుకు బయలుదేరాడు. చిమ్మ చీకటి, దానికితోడు కుంభవృష్టి పడుతూవుంది. అటువంటి సమయంలో గంగానదిని దాటి భార్య ఇంటికి చేరుకొన్నాడు. అప్పుడు అతని భార్య రత్నావళి చేసిన హెచ్చరిక అతని జీవితాన్నే మార్చేసింది.అస్థిచర్మమయ దేహ మను తామేజైసీప్రీతి తైసి జో శ్రీరామమహ హోత వతౌభవతి! నాథా! ఎముకలు, చర్మంతో కూడిన ఈ దేహంపై ఉన్నంత ప్రేమ ఆ శ్రీరాముని మీద ఉంటే భవభీతియే ఉండదు కాదా! అన్న రత్నావళి మాటలే తులసీదాసుకు తారకమంత్రమయ్యాయి. భార్య మాటలతో పరివర్తన చెందిన తులసీదాసు విరాగిగా మారి శ్రీరామచంద్రుని భక్తిలో నిమగ్నుడయ్యాడు. కాశీ, అయోధ్య ఆయనకు నివాస స్థానాలయ్యాయి. జీవిత చరమదశలో ఆయన కాశీలోనే ఉన్నాడు. లోకకల్యాణ కరమైన 'రామచరితమానస్' మహాకావ్యాన్ని రాయడం తులసీదాసు అయోధ్యలోనే ప్రారంభించాడు. తరువాత కాశీలో ఉంటూ రెండున్నర సంవత్సరాలలో రామచరితమానస్ పూర్తి చేశాడు.తులసీదాసును వాల్మీకి అవతారమని అంటారు. భక్తిభావం, కావ్య రచన, తాదాత్మ్యత, భాష చూస్తే ఆయన అపర వాల్మీకి అనటానికి ఏ సందేహమూ లేదు. తులసీదాసు తన జీవిత కాలంలో సంస్కృతంతో పాటుగా హిందీలో 22 రచనలు చేశాడు. తులసీదాసు ఇతర రచనల్లో దోహావళి, కవితావళి, గీతావళి, వినయ పీఠిక, జానకీ మంగళ్, రామలాల నహచాచు, రామాంజ ప్రసన్న, పార్వతి మంగళ్, కృష్ణ గీతావళి, హుమాన్ బాహుక, సంకట మోచనస వైరాగ్య సందీపిని, హనుమాన్ చాలీసా వంటివి ఉన్నాయి. అయితే రామచరితమానస్ ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా చేసింది.తులసీదాసు కేవలం రచనలకే పరిమితం కాకుండా, కొడిగడుతున్న హిందూ జ్వాలను భక్తి ఉద్యమం ద్వారా మళ్లీ ప్రజ్వరిల్లేట్లు చేసిన మహా భక్తుడు. ఆయన ఉత్తర భారతదేశమంతా పర్యటించి అఖాడాల స్థాపన ద్వారా యువతలో పోరాట పటిమను రేకెత్తించాడు. ఇప్పటికీ ఆ అఖాడాలు కొనసాగుతూ ఉండటం గమనార్హం. తులసీదాసు ఎన్నో ఆంజనేయ స్వామి ఆలయాలు స్థాపించాడు. వారణాసిలోని సంకటమోచన్ దేవాలయాన్ని ఆయనే కట్టించాడు. తనకు రాముని దర్శన భాగ్యం కల్పించిన హనుమంతునికి కృతజ్ఞతగా ఈ ఆలయాన్ని కట్టించాడని ప్రతీతి. తులసీదాసు పరమేశ్వరుడిని, ఆంజనేయ స్వామిని ప్రత్యక్షంగా చూసినట్లు చెబుతారు. రామచరిత మానస్ రచనలో తులసీదాసుకు ఆంజనేయ స్వామి చాలా సహాయం చేశాడని చెప్పుకొంటారు. తులసీదాసు విరచిత హనుమాన్ చాలీసా జగత్తు ప్రసిద్ధి చెందిన సాధనామంత్రం.

# క్లిక్.. క్లిక్.. నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

### -ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకే దక్కుతుంది

(ప్రజా సీమ)




ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవజీవితంతో ఫొటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. ఫొటోగ్రఫీకి శతాబ్దాల చరిత్ర ఉంది. ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం ఆగస్టు 19 న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. లూయిస్ డాగ్యురే అభివృద్ధి చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫోటోగ్రాఫర్‌లను ఏకం చేయడానికి మరింత మందిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 19 న ప్రపంచ స్థాయిలో జరుపుకుంటారు. ఫోటోగ్రఫీ అనేది గ్రీకు పదం నుండి వచ్చింది. ఫొటో అంటే కాంతి, గ్రాఫి అంటే తీసుకోవడం. ప్రపంచ ఫోటో దినోత్సవం, దీనిని 19 ఆగస్టు 1910న మొదటగా జరుపుకున్నారు. ఫోటోగ్రఫీ దినోత్సవం డాగ్యురో అనే శాస్త్రవేత్త ఆవిష్కరణల నుండి ఉద్భవించింది. ఫ్రెంచ్‌దేశానికి చెందిన లూయిస్ డాగ్యురే, జోసెఫ్ నైస్‌ఫోర్ నీప్స్ అభివృద్ధి చేసిన ఫోటోగ్రఫీ ప్రక్రియల గురించి 1839 జనవరి 9న ఫెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ డాగ్యూరే టైప్ ప్రాసెస్‌ను అధికారికంగా ప్రకటించింది. తర్వాత కొద్దినెలలకు 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం ఫొటోగ్రఫీపై పెటెంట్ హక్కులను కొనుగోలు చేసి దానిని ప్రపంచానికి ఉచిత బహుమతిగా అందించింది. అందుకే ఏటా ఆగస్టు 19ని ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంగా జరుపుతున్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్ 1991 నుంచి దేశంలో ప్రతియేటా ఆగస్టు 19న ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపడం ప్రారంభించింది. మనదేశంలో 1840లోనే ఫొటోగ్రఫీ కి సంబంధించిన ఆనవాళ్ళు ఉన్నాయి. మొట్ట మొదటిగా కలకత్తాలో కేలోటైపు మొదటి ఫొటోగ్రఫీ స్టూడియో స్థాపించారు. ఇదే భారతదేశంలో మొట్టమొదటి స్టూడియో. ఇప్పటికి 8 చౌరంగీరోడ్డు కల కత్తాలో నిల్చి ఉన్నది.1854లో ఫొటో గ్రాఫిక్ సొసైటీ ఆఫ్ బాంబే స్థాపించబడింది. మనదేశంలో ఇది మొట్టమొదటి ఫొటోక్లబ్బు. ఆ తర్వాత ఇది ఫొటోగ్రఫీ సొసైటీ ఆఫ్ ఇండియాగా మార్పు చెందింది. అప్పట్లో కేవలం బ్రిటీష్‌రాజు, జమిందారులకు మాత్రమే దీన్ని ఉపయోగించేవారు. 1877 నుంచి ఫొటోగ్రఫీ సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. జేఎన్‌టీయూలో బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వెంకటేశ్వర ఫైనార్ట్స్ కళాశాల, లకోటియా ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఫొటోగ్రఫీలో శిక్షణనిస్తున్నారు. వీటిలోనే కాకుండా పలు ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లో కూడా ఫొటోగ్రఫీలో శిక్షణ ఇస్తున్నారు. ఫొటోగ్రఫీ నాలుగేళ్ల కోర్సులో ఎనిమిది సెమిస్టర్లుంటాయి. 30 సీట్లను ప్రవేశపరీక్ష ద్వారా భర్తీ చేస్తారు.ఫ్యాషన్, పారిశ్రామిక, పర్యాటక, ట్రావెల్, జర్నల్‌లకు సంబంధించి ఫొటోగ్రఫీ, కంప్యూటర్ గ్రాఫిక్స్‌లో కూడా శిక్షణ ఉంటుంది.ఫొటోగ్రఫీలో ఒకప్పుడు పురుషులు మాత్రమే ఉండేవారు. కానీ ప్రస్తుతం పురుషులతో సమానంగా మహిళలు కూడా ఈ రంగంపై మక్కువ కనబరుస్తున్నారు.

# నేడు పెద్దపల్లి జిల్లాలో నలుగురు రాష్ట్ర మంత్రుల పర్యటన

### -మంథని, సుల్తానాబాద్, రామగుండం లలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
### -రూ.164.64 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
### -మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో మంథనిలో అభివృద్ధి పథకాలపై బారి బహిరంగ సభ

(ప్రజా సీమ)




పెద్దపల్లి జిల్లాలోని మంథని, సుల్తానాబాద్, రామగుండం లలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు నలుగురు రాష్ట్ర మంత్రులు బుధవారం పర్యటించనున్నారు.ముందుగా ఉదయం 10:30 నిమిషాలకు సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసి 12 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పెద్దపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎస్సీ మరియు ఎస్టీ వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు పాల్గొననున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు మంథని మున్సిపాలిటీ పరిధి లోని గంగాపురి వద్ద నాక్ స్కిల్ డెవలప్మెంట్ భవనానికి రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలసి మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం మంథని పెట్రోల్ బంక్ చౌరస్తా వద్ద మధ్యాహ్నం 2-20 నిముషాలకు నాలుగు మండలాలకు సంబంధించి 9 గ్రామాలకు మైదుపల్లి, ఎక్లాస్ పూర్, గుంజపడుగు, అడవి సోమన్ పల్లి, కేశనపల్లి, మచ్చుపేట, సుందిళ్ళ, కమాన్ పూర్, రాణాపూర్ సి ఎస్ ఆర్ క్రింద 9 వైకుంఠ రథాలను మంథని పెట్రోల్ బంక్ వద్ద 9 గ్రామాల సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవం చేయనున్నారు. మధ్యాహ్నం 2:30 నిమిషాలకు మంథని బస్ డిపో వద్ద 164 కోట్ల 64 లక్షల కు సంబంధించిన పలు రోడ్లను తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. మంథని పట్టణంలో బ్రిడ్జి రోడ్ నుండి బస్ డిపో వరకు వెడల్పు డ్రైన్ నిర్మాణానికి గాను రూ.15 కోట్లు, సెంట్రల్ లైటింగ్ కు రూ. కోటి 20 లక్షలు, గాంధీచౌక్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు రోడ్డు వెడల్పు సెంట్రల్ లైటింగ్ కు రూ.59 లక్షలు, అంబేద్కర్ చౌక్ నుండి ముత్యాలమ్మ టెంపుల్ వరకు రోడ్డు వెడల్పు 35 లక్షలు, క్యాంప్ ఆఫీస్ రోడ్డు 50 లక్షలు, ఇతర అన్ని వార్డులలో 9 కోట్లతో టౌన్ లో రోడ్లు శంకుస్థాపనచేయనున్నారు మంథని డిపో నుండి డిగ్రీ కాలేజ్ వరకు 21 కోట్లు సిఆర్ఎఫ్ నిధులతో శంకుస్థాపన మంథని డిపో నుండి గోదావరి వరకు 4 లైన్ రోడ్డు జపడుగు నుండి వయా ఉప్పట్ల మీదుగా విలోచవరం వరకు 10.9 కిలోమీటర్ల రోడ్డుకు 8 కోట్ల 78 లక్షలు నిధులతో శంకుస్థాపన, కూనారం టు ముత్తారం రోడ్డు 18 కిలోమీటర్లు రోడ్డు 36 కోట్ల 28 లక్షలు నిధులతో శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం లో పలు అభివృద్ధి కార్యక్రమాల సంబంధించి నాలుగు మండలాల స్మార్ట్ రేషన్ కార్డు ల పంపిణీ, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్, మైనార్టీ కుట్టుమిషన్లు, మహిళ స్వశక్తి సంఘాలకు చెక్కుల పంపిణీ కోసం నిర్వహించే బహిరంగ సభ పబ్లిక్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం మధ్యాహ్నం 4-30 నిమిషాలకు రామగుండంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొననున్నారు.

# సంక్షేమం, అభివృద్ధి కూటమికే సాధ్యం

## పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు, పార్ల రాంప్రసాద్

**సిద్ధవటం (ప్రజా సీమ)**

సంక్షేమం అభివృద్ధి, కూటమి ప్రభుత్వానికి సాధ్యమని రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు పార్ల రాంప్రసాద్ తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామ శివారులోని బండారుపల్లి కాలనీలో మంగళవారం రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో ఇంటింటా టిడిపి కరపత్రాలు పంపిణీ చేపట్టారు ఈ సందర్భంగా తెలుగు యువత ఉపాధ్యక్షులు రాంప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయని ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా కూడా ప్రతి ఒక్కరికి తల్లికి వందనం అమలు కావడంతో తల్లులు హర్షం వ్యక్తం చేశారని మహిళలకు శ్రీ శక్తి పథకం ద్వారా ఏపీ రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా వెళ్లడానికి వెసులుబాటు కల్పించినందుకు మహిళలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవితేజ తదితరులు పాల్గొన్నారు



# వెలుగు ప్రిన్సిపాల్ పి.లీనా కుమారి సేవలు అమూల్యమైనవి

- మంత్రిచేత ప్రశంసా పత్రం అందుకోవడం గర్వకారణం
- సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి,సిబ్బంది అభినందనలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె పట్టణం బెంగుళూరు రోడ్డు,బిటి కాలేజి గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో భాగంగా అన్నమయ్య జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు,హిజ్రాలు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్,ఆర్.ఓ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వెలుగు సంస్థ సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి సహకారంతో దివ్యాంగులు,వృద్ధులకు అవసరమయ్యే ప్రత్యేక ఉపకరణాలు ఏర్పాటు చేసిన స్టాల్ ను మంత్రి రాం ప్రసాద్ రెడ్డి,జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ,సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి,ఎస్పీ ధీరజ్ కూసుబిల్లి సందర్శించగా దివ్యాంగులు పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు.ముఖ్య అతిధుల చేతుల మీదుగా బధిరులైన అఖిల్,చరణ్ లకు హియరింగ్ ఎయిడ్స్,దివ్యాంగులైన ఐశ్వర్య,అనూషలకు టిఎల్ఎం కిట్స్,శారీరక దివ్యాంగురాలైన రెడ్డెమ్మకు వీల్ చైర్ అందజేశారు.వెలుగు ప్రత్యేక పాఠశాల నందు గత 30 ఏళ్లుగా దివ్యాంగులకు నిబద్ధతతో కూడిన విశిష్ట సేవలను అందిస్తున్న ప్రిన్సిపాల్ పి.లీనా కుమారి సేవలను ప్రభుత్వం గుర్తించి ఆగస్టు 15న మంత్రి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా అత్యుత్తమ సేవ ప్రశంసా పత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమెకు వెలుగు సిబ్బంది,దివ్యాంగులు,బధిరులు శుభాకాంక్షలు తెలిపారు.





# ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వీఆర్వోలు

- ప్రైవేట్ కార్యాలయాల నిర్వహణపై చర్యలు తీసుకోవాలి
- మదనపల్లె తహసిల్దార్ కి బీవైఎస్ అధ్యక్షులు పునీత్ వినతి

**మదనపల్లె (ప్రజా సీమ) :**



అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె మండల పరిధిలోని గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్యాలయానికి వెలుపల ప్రైవేట్ ప్రదేశాలలో అనధికారిక కార్యాలయాలను ఏర్పాటు చేసి,ప్రభుత్వ రికార్డులను భద్రపరుస్తున్న వైనంపై తక్షణ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షులు గోవిందు పునీత్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం ఆయన మదనపల్లె తహశీల్దార్ మాధవికి అధికారికంగా ఒక వినతిపత్రం సమర్పించారు.ప్రభుత్వ సచివాలయాలు లేదా ఎమ్మార్వో కార్యాలయంలో విధులు నిర్వర్తించాల్సిన వీఆర్వోలు,సొంత ప్రైవేట్ భవనాలలో ప్రత్యేక కార్యాలయాలు నడుపుతుండటం వల్ల భూముల రికార్డులు,పహానీలు,అడంగల్స్ వంటి అత్యంత గోప్యమైన ప్రభుత్వ డాక్యుమెంట్ల భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.పర్యవేక్షణ లేకపోవడం వల్ల రికార్డుల ట్యాంపరింగ్,అవినీతికి ఆస్కారం ఏర్పడుతోందని,సామాన్య రైతులు మరియు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అందువల్ల తహశీల్దార్ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి,ప్రైవేట్ ఆఫీసులు నిర్వహిస్తున్న వీఆర్వోలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి,రికార్డులను తహసీల్దార్ కార్యాలయానికి తరలించాలని మరియు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పునీత్ కుమార్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు పాల్గొన్నారు.

# క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఆదిత్య విద్యార్థుల అద్వితీయ ప్రతిభ

- ఇంట్రన్షిప్,ఉద్యోగాలకు 38 మంది విద్యార్థులు ఎంపిక

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రముఖ సంస్థ క్యూ స్పైడర్స్ 38 మంది విద్యార్థులను ఇంట్రన్షిప్ మరియు ఉద్యోగాలకు ఎంపిక చేసింది.ఎంపికైన విద్యార్థులకు రూ.3.6 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.విద్యార్థుల ప్రతిభ,సాంకేతిక పరిజ్ఞానం,కమ్యూనికేషన్ నైపుణ్యాలు తదితర అంశాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించారు.38 మంది విద్యార్థులకు ఇంట్రన్షిప్ మరియు ఉద్యోగావకాశాలు లభించడం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ,విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు,కమ్యూనికేషన్ స్కిల్స్,ఉద్యోగానికి అవసరమైన శిక్షణ అందించడంపై కళాశాల ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.క్యూ స్పైడర్స్ సంస్థలో 38 మంది విద్యార్థులు ఎంపిక కావడం కళాశాల విద్యార్థుల ప్రతిభకు,అధ్యాపకుల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థలను కళాశాలకు తీసుకువచ్చి విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయుడు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ తమ ప్రతిభను ఉద్యోగంలో కూడా నిరూపించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థులు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ మంచి కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం,విభాగాధిపతులు,అధ్యాపకులు మరియు విద్యార్థులు ఎంపికైన అభ్యర్థులను అభినందించారు.రూ.3.6 లక్షల ప్యాకేజీతో 38 మంది విద్యార్థులు క్యూ స్పైడర్స్ లో ఎంపిక కావడం కళాశాల ప్లేస్‌మెంట్ విజయాల్లో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని కొనియాడారు.



# మిట్స్ వర్శిటీతో అప్రోటెక్ ఆర్ అండ్ డి సొల్యూషన్స్ అవగాహన ఒప్పందం

- ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీ.ఎస్.సి) విభాగం,మిట్స్ ఇండస్ట్రీ రిలేషన్స్ సెల్ ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన అప్రోటెక్ ఆర్ అండ్ డీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో పరిశ్రమ--విద్యాసంస్థల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యాలు,శిక్షణ,ప్రాయోగిక అనుభవం అందించడంతోపాటు వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.పరిశ్రమలతో విద్యాసంస్థల భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకుని,ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అప్రోటెక్ ఆర్ అండ్ డీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎస్.ప్రభు మాట్లాడుతూ అవగాహన ఒప్పందం లక్ష్యాలు ,ప్రాధాన్యతను వివరించారు.ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ,ప్లేస్‌మెంట్ అవకాశాలు,పారిశ్రామిక శిక్షణ,కెరీర్ అభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.అదేవిధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,మెషిన్ లెర్నింగ్,డేటా సైన్స్,క్లౌడ్ కంప్యూటింగ్,సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో పరిశ్రమ ఆధారిత శిక్షణ,సాంకేతిక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ,సర్టిఫికేషన్ కోర్సులు, పరిశ్రమ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు ,ప్లేస్‌మెంట్ సహాయం, పరిశోధనా సహకారం వంటి అవకాశాలను విద్యార్థులకు కల్పించనున్నట్లు తెలిపారు.ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు వాస్తవ పరిశ్రమ ప్రాజెక్టులపై పనిచేసే అనుభవాన్ని పొందడంతో పాటు,పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ సాంకేతిక మరియు వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరచుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీదేవి మరియు అప్రోటెక్ ఆర్ అండ్ డీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎస్.ప్రభు పరస్పరం అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.ఈ కార్యక్రమంలో డీన్ - స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ డాక్టర్ సి.చంద్ర ప్రకాష్ గుప్తా,అసిస్టెంట్ డైరెక్టర్-ఇండస్ట్రీ రిలేషన్స్ పి.ఎం బాలాజీ,కో- ఆర్డినేటర్లు డి.రామలింగం, డాక్టర్ ఆర్.సుధాకర్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.





# బీసీల ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత

- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం
- తల్లికి వందనంతో పేద కుటుంబాల్లో విద్యా వెలుగులు
- అసెంబ్లీలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా కీలక ప్రసంగం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు.శాసనసభ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆయన కీలక ప్రసంగం చేశారు.బీసీల రాజకీయ, సామాజిక,ఆర్థిక సాధికారతకు ఈ నిర్ణయం దోహదపడుతుందన్నారు.బీసీల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్‌లకు శాసనసభ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న బీసీ వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు బలమైన పునాదిగా మారతాయని ఎమ్మెల్యే అన్నారు.సర్పంచ్, వార్డు సభ్యులు,ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థాయి నుంచి మున్సిపల్ చైర్మన్లు,మేయర్ల వరకు అన్ని స్థాయిల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరిగే అవకాశం ఏర్పడుతుందన్నారు.గత ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి వారి రాజకీయ అవకాశాలను దెబ్బతీసిందని విమర్శించారు.అయితే కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించడం ద్వారా బీసీలకు న్యాయం చేసిందని,ఈ నిర్ణయం దేశానికే ఆదర్శంగా నిలిచేలా ఉందని కొనియాడారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం బీసీ,ముస్లిం మైనార్టీ సహా పేద కుటుంబాల పిల్లల విద్యకు అండగా నిలుస్తోందని షాజహాన్ బాషా తెలిపారు.నియోజకవర్గ పర్యటనలో ఓ మైనార్టీ కుటుంబానికి చెందిన వ్యక్తి తన పిల్లల చదువుల గురించి వెల్లడించిన విషయాన్ని శాసనసభలో ప్రస్తావించినట్లు చెప్పారు.ఎంతమంది పిల్లలు ఉన్నా వారికి తల్లికి వందనం పథకం వర్తింపజేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో చదువులు మధ్యలో నిలిపివేసే పరిస్థితి ఉండదన్నారు.పేద కుటుంబంలో ఒక్కరు ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగం సాధించినా ఆ కుటుంబ ఆర్థిక,సామాజిక స్థితిగతులు మారిపోతాయని చెప్పారు.విద్యా పథకాలు,ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కార్యక్రమాలు బీసీల సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తున్నాయని పేర్కొన్నారు.బీసీల ఆర్థిక,సామాజిక, రాజకీయ ఉన్నతికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను బీసీ-ఈ వర్గానికి చెందిన బిడ్డగా తాను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు.బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు విద్య,ఉపాధి,ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు.34 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల్లో బీసీల భాగస్వామ్యం మరింత పెరిగి,అట్టడుగు వర్గాల నుంచి కొత్త నాయకత్వం వెలుగులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా

- జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్
- వేంపల్లె పోలీస్ స్టేషన్ లో కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభం

**వేంపల్లె ప్రజాసీమ:**

దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, ఇతరత్రా నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ వెల్లడించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, పులివెందుల డిఎస్పి మురళీ నాయక్, వేంపల్లె సీఐ నరసింహులు, ఎస్సై తిరుపాల్ నాయక్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణ, ప్రజల బద్రతకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టామని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్స్ సెంటర్ ని ఏర్పాటు చేశామన్నారు. ప్రధాన జంక్షన్లు, కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, నేరాల అవకాశం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి మొత్తం 18 కీలక ప్రాంతాల్లో 44 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 6 ఏఎన్పీఆర్ కెమెరాలతో పాటు 38 మెగా పిక్సల్ కెమెరాలు ఉన్నాయన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ లో భారీ టీవి స్క్రీన్ ద్వారా వేంపల్లె పట్టణంలోని కీలక ప్రాంతాలను పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేస్తారన్నారు. దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రజల బద్రతే లక్ష్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వేంపల్లె పోలీసులు చేపట్టిన చర్యలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ డిఎస్పీ సుధాకర్, పులివెందుల సీఐ శ్రీరామ్, రూరల్ సీఐ శాంతిలాల్, ట్రాఫిక్ సిఐ ప్రసాద్ రావు, ఎస్సైలు లక్ష్మిప్రియ, ప్రవీణ్ కుమార్, చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






ప్రజాసీమ

# దివ్యాంగులైన నాల్గవ తరగతి ప్రభుత్వ ఉద్యోగుల "ఓల్డ్ పెన్షన్ స్కీమ్" సాధన సదస్సు

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )

భారత రాజ్యాంగం, అంతర్జాతీయ ఒప్పందాలు మరియు వివిధ చట్టాల ద్వారా దివ్యాంగులకు సంక్రమించిన ఆర్థిక, సామాజిక, న్యాయ సూత్రాల ప్రకారం సమాన అవకాశాలు, హక్కులు కల్పించబడ్డాయి. కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో న్యాయశాఖ ఈ హక్కులపై అనేక కీలక తీర్పులను కూడా ఇచ్చింది. అయితే, ఆచరణలో దివ్యాంగులైన నాల్గవ తరగతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ఆర్థిక, సామాజిక, న్యాయ సూత్రాల అమలులో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఉద్యోగ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలలో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న నాల్గవ తరగతి దివ్యాంగ ఉద్యోగులకు "ఓల్డ్ పెన్షన్ స్కీమ్" అమలు కాకపోవడం వారి సామాజిక భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా సంక్రమించిన హక్కుల ద్వారా దివ్యాంగ ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ వంద శాతం ఎలా సాధ్యమవుతుందో సమగ్రంగా చర్చించేందుకు ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న నాల్గవ తరగతి దివ్యాంగ ఉద్యోగులందరూ ఈ సమావేశంలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి హాజరుకావాలనుకునే వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నమోదు చేసుకోవాల్సిన నెంబర్: 9959876668 (ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించవచ్చు, పేర్లు నమోదు చేసుకున్న ఉద్యోగులకు మాత్రమే సమావేశం జరిగే తేదీ, సమయం మరియు ప్రదేశం వివరాలను ఫోన్ ద్వారా తెలియజేస్తారు. అర్హులైన కేంద్ర, రాష్ట్ర నాల్గవ తరగతి దివ్యాంగ ఉద్యోగులందరూ



ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ హక్కుల సాధన కోసం కలిసికట్టుగా హాజరుకావాలని నిర్వాహకులు హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించండి

## - అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సూచనలు

మదనపల్లె (ప్రజా సీమ) :

సోమల పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఎస్పి ధీరజ్ కునుబిల్లి సందర్శించి, క్రైమ్ రికార్డులు మరియు రౌడీ షీటర్ల వివరాలను పరిశీలించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా పెంచాలని, స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేస్తూ సిబ్బంది యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చౌడేపల్లి సీఐ పి.సాయిప్రసాద్, సోమల ఎస్ఐ ఎన్.రమేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# రవీంద్రనాథ్ ఠాగూర్ కాటేజీ అభివృద్ధికి సహకరించండి

## - చరిత్ర ప్రతిబింబించేలా స్మారక భవనం, మ్యూజియం ఏర్పాటు చేయాలి

## - కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి బీజేపి నేతల వినతి

మదనపల్లె (ప్రజా సీమ) :

భారత జాతీయ గీతం రచించబడిన మదనపల్లెలో రవీంద్రనాథ్ ఠాగూర్ బస చేసిన కాటేజీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి అన్నమయ్య జిల్లా బీజేపీ కార్యదర్శిబర్నేపల్లె రవికుమార్, బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ జి.అజ్మతుల్లా ఖాన్, బిజెపి నాయకులు కృష్ణయ్య వర్మ, పూల నాగరాజులు వినతి పత్రం అందజేశారు. అన్నమయ్య జిల్లాలో మదనపల్లెకు భారతదేశ చరిత్రలో ఒక విశిష్ట స్థానం ఉందని గుర్తుచేశారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమన జాతీయ గీతాన్ని ఆయన స్వయంగా బెంగాలి నుండి ఆంగ్లంలోకి అనువదించి, దానికి స్వరరూపం ఇచ్చిన చారిత్రాత్మక ప్రదేశంగా మదనపల్లె ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ అపూర్వ వారసత్వం దేశానికి గర్వకారణం. ఇంతటి చారిత్రక ప్రాధాన్యం ఉన్న మదనపల్లెకు ఠాగూర్ బస చేసిన కాటేజీకి తగిన స్థాయిలో అభివృద్ధి, పర్యాటక ప్రోత్సాహం, జాతీయ గుర్తింపు



లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఈ అంశాన్ని పరిశీలించి మదనపల్లె బిటి కళాశాల ప్రాంగణంలో ఠాగూర్ బస చేసిన ప్రాంతాన్ని జాతీయ వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. జాతీయ గీత చరిత్రను ప్రతి బింబించే స్మారక భవనం, మ్యూజియం ,పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, రవీంద్రనాథ్ ఠాగూర్‌కు సంబంధించిన చారిత్రక ప్రాంతాలను సంరక్షించి అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. రహదారులు ,రైల్వే, పర్యాటక, వసతులు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి మదనపల్లెకు విశేష గుర్తింపు తీసుకురా వడంతోపాటు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ఈ పవిత్ర ప్రాంతం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# గొల్లప్రోలు మండలంలో 2 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )

గొల్లప్రోలు, విద్యా సంవత్సరానికి అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు గొల్లప్రోలు మండలానికి మొత్తం రెండు పోస్టులు మంజూరయ్యాయి. గొల్లప్రోలు మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, తాటిపర్తిలో స్కూల్ అసిస్టెంట్ (హిందీ) ఒక పోస్టు, జెడ్పీ ఉన్నత పాఠశాల, వన్నెపూడిలో స్కూల్ అసిస్టెంట్ (బయలాజికల్ సైన్స్) ఒక పోస్టు చొప్పున మొత్తం రెండు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు కేటాయించారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత దరఖాస్తుతో పాటు తమ విద్యార్హతలకు సంబంధించిన పూర్తి వివరాలు, ధ్రువపత్రాల ప్రతులను జతచేసి ఆగస్టు 21, 2026 సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని మండల విద్యాశాఖ అధికారులు వి. శ్రీనివాస్, బి.వి. శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నియామకానికి సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానం తదితర సమాచారం కోసం మండల విద్యాశాఖ కార్యాలయం, గొల్లప్రోలును సంప్రదించాలని వారు సూచించారు.



# తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీ ఆకస్మిక తనిఖీ

## -అధికారుల గైర్హాజరుపై తీవ్ర ఆగ్రహం!

కాకినాడ జిల్లా (ప్రజాసీమ )

కాకినాడ పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ మంగళవారం గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి వస్తున్న రైతులు, ప్రజల ఇబ్బందులు, అధికారుల నిర్లక్ష్యంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీకి సంబంధించిన పూర్తి వివరాలు పరిశీలిస్తే ఎంపీ ఉదయ శ్రీనివాస్ కాకినాడ నుండి చేబ్రోలు పట్టు పరిశ్రమ కేంద్రానికి వెళు తుండగా మార్గమధ్యంలో గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీగా రైతులు, ప్రజలు ఉండటాన్ని గమనించారు. దీంతో ఆయన ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి కారు దిగి నేరుగా రెవెన్యూ కార్యాలయంలోకి వెళ్లారు. ఎంపీ కార్యాలయంలోకి వెళ్లే సమయానికి ఒక విలేజ్ సర్వేయర్, మరో అధికారి, డేటా ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్ విధుల్లో ఉన్నారు. ముఖ్య అధికారులెవరూ సీట్లలో లేకపోవడంపై ఎంపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను తెప్పించుకుని పరిశీలించగా ఆఫీసులో లేని అధికారులు సంతకాలు చేసి ఉండటాన్ని గమనించిన ఎంపీ అధికారులు విధులకు వచ్చారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీ సర్వేలో తలెత్తిన చెప్పులను సరిచేసుకునేందుకు నెలలు తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పనులు జరగడం లేదని ఎంపీ వద్ద వాపోయారు. మ్యుటేషన్, సర్వే దరఖాస్తులు, సబ్ డివిజన్ ఫైళ్లు గడువు దాటినా ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, విద్యార్థులకు అవసరమైన వివిధ ధృవీకరణ పత్రాలను పెండింగ్‌లో పెట్టడంపై మండిపడ్డారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిచేయించుకోవడానికి రైతులు ఆఫీసుల చుట్టూ తిరగాలా అని నిలదీశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల దరఖాస్తులను తక్షణమే క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇది డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజవర్గమని గుర్తు చేశారు. పిఠాపురం నియోజకవర్గ



పరిధిలో అధికారులు మరింత బాధ్యతగా, పారదర్శకంగా పనిచేయాలని హితవు పలికారు. రైతులను ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్నా పనుల కోసం లంచాలు డిమాండ్ చేసిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల కొంతమంది వీఆర్వోలు ఆ పై అధికారి భూముల రీ సర్వే తప్పులను సరిదిద్దేందుకు రైతులు వద్ద సొమ్ములు డిమాండ్ చేస్తున్నారని ఎంపీ కి ఫిర్యాదులు అందడంతోనే ఆయన ఈ మెరుపు తనిఖీ చేపట్టినట్లు తెలుస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా ఎంపీ నేరుగా తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లి సుమారు గంటకు పైగా తనిఖీలు చేపట్టడం గొల్లప్రోలులో సంచలనంగా మారింది. -ప్రజలతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎంపీ తహసీల్దార్ కార్యాలయం తనిఖీ ముగించుకున్న అనంతరం కార్యాలయం బయట రామ కోవెల వద్ద వేచి ఉన్న ప్రజలను, సీనియర్ సిటిజెన్స్ ను ఎంపీ ఉదయ్ ఆప్యాయంగా పలకరించారు. వారి వద్ద కొంతసేపు కూర్చున్న ఎంపీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: విద్యార్థులకు అవగాహన

పిఠాపురం, ఆగస్టు 18: (ప్రజా సీమ )

మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలు, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యం, విద్యా భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాల గురించి వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే జూూ+ూజు టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించి, "డ్రగ్స్ వద్దు బ్రో" అంటూ నినాదాలు చేయించారు.

కార్యక్రమంలో జూూ+ూజు సిబ్బంది సూర్య చక్ర, జగదీష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





# పిఠాపురంలో శ్రీ పవన్ కళ్యాణ్, శ్రీ పిడుగు హరి ప్రసాద్ గార్లు త్వరగా కోలుకోవాలని

## శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు

పిఠాపురం, (ప్రజా సీమ )

జనసేన పార్టీ అధినేత శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ , అలాగే పార్టీ అగ్రనేత శ్రీ పిడుగు హరి ప్రసాద్ తీవ్ర జ్వరం నుండి త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో పునరంకితం కావాలని ఆకాంక్షిస్తూ పిఠాపురం పట్టణంలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి సన్నిధిలో జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు.

సమాజ సంక్షేమం, ధర్మ రక్షణ, ప్రజాసేవ కోసం నిరంతరం శ్రమిస్తున్న జనసేనాని శ్రీ పవన్ కళ్యాణ్, అలాగే ఆయన ఆదేశాలను కర్తవ్యనిష్ఠతో, అచంచల భక్తి విధేయతలతో నిర్వహిస్తూ తనకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేస్తున్న శ్రీ పిడుగు హరి ప్రసాద్ కి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో నాగవల్లి పత్ర పూజ, సింధూర అర్చన, మృత్యుంజయ నామస్మరణ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ ఆంజనేయ స్వామివారి అనుగ్రహంతో వారిద్దరికీ సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు, శక్తి, ధైర్యం కలగాలని భక్తులు, నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ కంచర్ల భవాని శంకర్ , పిఠాపురం పట్టణ వైస్ ఇంచార్జ్ శ్రీ బాలిపల్లి అనిల్ , గొల్లప్రోలు నాయకులు శ్రీ మొగలి రాజా , పట్టణ వార్డు ఇంచార్జిలు శ్రీ గౌతు రాజా , శ్రీ బాలిపల్లి శివ సూర్య, ప్రముఖ నాయకులు శ్రీ గండేపల్లి గౌతమ్ , శ్రీ దాసరి కిరణ్ మరియు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# రైతులు తప్పనిసరి విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

**- వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి**

**- ఎల్ నినో ప్రభావ దృష్ట్యా ఆరుతడి పంటలపై అవగాహన**

**వేంపల్లె ప్రజాసీమ:**

ప్రతి రైతు 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్యను తప్పనిసరి నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని నందిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ నినో ప్రభావ దృష్ట్యా తక్కువ నీటితో ఆరుతడి పంటల సాగు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై రైతులకు స్పష్టంగా వివరించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించ వచ్చన్నారు. భవిష్యత్ లో వివిధ రకాల ప్రభుత్వ పథకాలు పొందేందుకు 11 అంకెల విశిష్ట సంఖ్యను కలిగి ఉండాలన్నారు. అలాగే ఈ పంట నమోదు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, స్వల్పకాలిక వ్యవధి గల పంటలను సాగు చేయాలన్నారు. వేరుశెనగ పంట పొలాల్లో సందర్శించి చీడపీడల నివారణకు తగిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# 20న గుండె సంబంధిత వైద్యులు రాక

**- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**వేంపల్లె ప్రజాసీమ:**



ఈనెల 20వ తేదీన ప్రముఖ కార్డియాలజీస్ట్ వైద్యుడు డాక్టర్ ఎన్.శ్రావణ్ కుమార్ రెడ్డి వేంపల్లెకు రానున్నట్లు డాక్టర్ బాషా హాస్పిటల్ సిబ్బంది తెలిపారు. కడప నగరంలోని వేదాంత హాస్పిటల్ కి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు గుండె సంబంధిత వ్యాధులపై వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు ఇసిజీ, 2డి ఇకో సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డాక్టర్ అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. మరిన్ని సమాచారం కోసం స్థానిక బాషా హాస్పిటల్ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

# మాదక ద్రవ్యాల నిరోధకంపై అవగాహన

**- ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ**

**వేంపల్లె ప్రజాసీమ:**

మాదక ద్రవ్యాల నిరోధకం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ వెల్లడించారు. మంగళవారం ఆ కళాశాలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విధ్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వీటి వల్ల ఎన్నో జీవితాలు నాశనం అవుతున్నాయని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలపై అవగాహన పెంపొందించు కోవాలని, వీటి దుష్ప్రభావాలపై ఇతరులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సాజీయ బేగం, అధ్యాపకులు నాగేంద్ర, మసూద్, ఎన్ఎస్ఎస్ అధికారులు కుమార్ రాజా, జనార్దన్, మై భారత్ కోఆర్డినేటర్ రాజారెడ్డి, పీడీ తేజేంద్ర, వినోద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# కరువు ప్రభావిత ప్రాంతాల్లోని రైతులను ఆదుకోవాలి

**- వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ రెడ్డి**

**వేంపల్లె ప్రజాసీమ:**




కరువు ప్రభావిత ప్రాంతాల్లోని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ముతుకూరు మస్తాన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు నెల 20వ తారీఖు వస్తున్న ఇప్పటికీ చినుకు జాడే లేదన్నారు. దీంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయి పంటల సాగుకు నీటి కోరత ఏర్పడిందన్నారు. దీనిపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుం దన్నారు. అలాగే ఇన్పుట్ సబ్సిడీ రూపంలో ఎకరానికి రూ.20 వేల చొప్పున ప్రతి రైతుకు సాయం అందించాలని కోరారు. ఇప్పటికే రైతులు విత్తనాలు తెచ్చుకుని నష్టపోయారని, వేరుశెనగ, అరటి, ఉల్లి, మిరప పంటలకు పూర్తి నష్టం వాటిల్లిందని వాపోయారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి:

**ఎస్ఎఫ్ఐ డిమాండ్**

**పిఠాపురం,(ప్రజా సీమ )**

పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. కళాశాలలో మౌలిక వసతుల కొరత, తాగునీటి సమస్య, క్రీడా మైదానం ఆక్రమణ, తరగతి గదుల కొరత, కొత్త భవనం లేకపోవడం వంటి సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పిఠాపురం పాడా కార్యాలయ పీడీ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పిఠాపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, సిద్ధు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఆర్ఆర్బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే నూతన భవనాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తరగతి గదుల కొరతతో విద్యార్థులు సరైన వాతావరణంలో విద్యను అభ్యసించలేక పోతున్నారని, గతంలో నాలుగు కొత్త తరగతి గదుల నిర్మాణానికి హామీ ఇచ్చినా ఇప్పటివరకు పనులు ప్రారంభించ కపోవడం విచారకర మన్నారు. కళాశాలకు చెందిన క్రీడా మైదానాన్ని కొంతమంది బయటి వ్యక్తులు పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారని, దీంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని తెలిపారు. మైదానాన్ని ఆక్రమణల నుంచి వెంటనే విముక్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. క్రీడా మైదానానికి ప్రహరీ గోడ నిర్మించాలని, డ్రైనేజీ నీరు మైదానంలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని కూడా వెంటనే పూర్తి చేయాలని కోరారు.కళాశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, తాగునీరు అందుబాటులో లేక విద్యార్థులు బయట నుంచి వాటర్ క్యాన్లు తెచ్చుకోవాల్సి వస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న



మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేకపోవడంతో పలువురు విద్యార్థులు కళాశాల వెలుపల ఉన్న అన్నా క్యాంటీన్‌పై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలు ఇలాగే కొనసాగితే విద్యార్థుల విద్యా ప్రమాణాలు దెబ్బతినడంతో పాటు ఉత్తీర్ణత శాతం కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పిఠాపురం ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి కళాశాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి విద్యార్థులకు నాణ్యమైన విద్యా సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు తేజశ్రీ, కరుణాకర్, విజయ్, నితిన్, అశోక్, సూరిబాబు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మండలానికి తాగునీటి కోసం రూ.కోటి కేటాయించాలి


**అసెంబ్లీలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి డిమాండ్**

**మదనపల్లి జిల్లా పరిధిలోని 5 నియోజకవర్గాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి**

**కలకడ ప్రజాసీమ:**

మదనపల్లి జిల్లా పరిధిలోని పీలేరు, మదనపల్లి, పుంగనూరు, తంబళ్లపల్లి, రాయచోటి నియోజకవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించిన ఆయన, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.మదనపల్లి జిల్లా పరిధిలోని ప్రతి మండలానికి తాగునీటి అవసరాల కోసం రూ.కోటి చొప్పున నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిధులతో బోర్లు, నీటి వనరుల అభివృద్ధి, అవసరమైన చోట్ల నీటి సరఫరా ఏర్పాట్లు చేపట్టి ప్రజలకు తాగునీటిని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావంతో బోర్లు అడుగంటుతున్నాయిఎల్‌నినో ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు తగ్గిపోయి అనేక ప్రాంతాల్లో బోర్లు అడుగంటిపోయే పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాబోయే వేసవిలో పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని, ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోకపోతే గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల దాహార్తిని తీర్చడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, తాగునీటి సమస్యను కేవలం తాత్కాలికంగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరిం చేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కోరారు.మదనపల్లి జిల్లా కోసం గతంలో



పోరాటంమదనపల్లి జిల్లా ఏర్పాటు కోసం గతంలో ఎన్నో పోరాటాలు చేశామని ఎమ్మెల్యే గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మదనపల్లిని జిల్లాగా ప్రకటించడం తమ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. మదనపల్లిని జిల్లాగా ప్రకటించిన ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.మదనపల్లి జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అవసరమైన నిధులు మంజూరు చేసి, శాశ్వత పరిష్కారం చూపాలని అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# వినాయక చవితి పండుగ సందర్భం గా విగ్రహాల నిమజ్జనం కు పగడ్బందీ ఏర్పాట్లు కు చర్యలు

**జిల్లా యంత్రాంగం నకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు సహకరించండి**

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేశీధర ప్రసాద్**

**కాకినాడజిల్లా (ప్రజా సీమ )**

వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల నిమజ్జనం కు జిల్లా లో పగడ్బందీ ఏర్పాట్లు కు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేశీధర ప్రసాద్ పేర్కొన్నారు... మంగళ వారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు మందిరం లో గణపతి నవరాత్రులు మరియు నిమజ్జనం ఏర్పాట్లు పై సంబంధిత శాఖల అధి కారులు మరియు ఉత్సవ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమా వేశం నిర్వహించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....**

పర్యావరణ పరిరక్షణ కు మట్టి గణపతి ని పూజిద్దాం అని,విగ్రహాల తయారీలో రసాయన రంగులకు బదులుగా సాధ్యమైనంత వరకు సహజ రంగులను ఉపయోగించేలా చూడాలని తెలిపారు.. పర్యావరణానికి హాని కలగకుండా ఈ ఉత్సవాలనుశాంతి యుతవాతావరణం లో నిర్వహించేందుకు జిల్లా స్థాయి లో



సమావేశ నిర్వహణ తో పాటు డివిజన్,మండల స్థాయి లో కూడా ఉత్సవ కమిటీ లతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# చేనేత కార్మికుల సంక్షేమానికి ఓర్సు వీరభాస్కర్ నిర్విరామ కృషి





**- కొనియాడిన చేనేత,ప్రజాసంఘాల నాయకులు**

**మదనపల్లె (ప్రజా సీమ) :**

ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ చేనేత ఓబీసీ విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి ఓర్సు వీరభాస్కర్ చేనేత కార్మికుల పక్షపాతి అని చేనేత,ప్రజాసంఘాల నాయకులు ప్రశంసించారు.సోమవారం రాత్రి రింగ్ రోడ్డు కూడలిలో ఓర్సు వీరభాస్కర్ జన్మదిన వేడుకలు చేనేత కార్మికుల సమక్షంలో ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు కోన భాస్కర్,మోడెం నాగరాజు,ఆవుల మల్లికార్జున ,సాదినేని రమేష్ నాయుడు, కందికట్ల జయచంద్ర ,పసుపులేటి రమేష్,షేక్ బాబ్ జాన్,టి.వెంకటేష్ తదితరులు హాజరయ్యారు.ఇందులో భాగంగా కేక్ కట్ చేసి శాలువాలతో ఘనంగా సన్మానించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ చేనేత కుటుంబం నుండి వచ్చిన ఓర్సు వీరభాస్కర్ అంచలంచెలుగా ఎదిగి రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదగడం శుభపరిణామమన్నారు.చేనేత కార్మికుల శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తూ వారికి సంక్షేమ పథకాలను అందజేయడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.ముఖ్యంగా నేతన్న సేవలో పథకాన్ని అర్హులైన చేనేత కార్మికులకు అందజేయడంలో ఆయన కృషి అమోఘమన్నారు.చేనేత కార్మికుల అభ్యున్నతి,చేనేత రంగం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఓర్సు వీరభాస్కర్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# చేబ్రోలులో 'మేరా రేషమ్--మేరా అభిమాన్ 2.0' కార్యక్రమం

కాకినాడ జిల్లా ప్రజా సీమ )

పట్టు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని ప్రభుత్వ పట్టు మార్కెట్ కేంద్రంలో నిర్వహించిన 'మేరా రేషవ్--మేరా అభిమాన్ (నా పట్టు–నా అభిమానం) 2.0' కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు శ్రీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పట్టు పరిశ్రమలో శాస్త్రీయ పరిశోధనలను క్షేత్రస్థాయి పద్ధతులతో అనుసంధానం చేయడం, పట్టు రైతులకు ఆధునిక సాంకేతికతతో పాటు శాస్త్రీయ విధానాలను అందుబాటులోకి తీసుకురావడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అనంతరం పట్టు రైతులతో ఎంపీ నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. పట్టు సాగులో రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం, ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతపై చర్చించారు



# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలి - తాసిల్దార్ మురళీకృష్ణ

పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:

ఎస్ఐఆర్లో భాగంగా వివిధ కారణాలతో పెండింగ్లో ఉన్న ఓటర్లను తిరిగి వెరిఫికేషన్కు పిలిపించి, వారి వద్ద ఉన్న సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించే ప్రక్రియను పుల్లంపేట మండలంలో కొమ్మనవారిపల్లి. వల్లూరు పల్లె లో తహసీల్దార్ మురళీకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు, ఈఆర్ఓ కిరణ్కుమార్రెడ్డి నిర్వహిస్తున్న సర్వే పనితీరును ఆయన పరిశీలించి, సంబంధిత ఓటర్లతో మాట్లాడారు. అర్హతకు సంబంధించిన సరైన పత్రాలను స్వీకరించి పరిశీలించిన అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం తహసీల్దార్ మురళీకృష్ణ వల్లూరుపల్లె పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించేందుకు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యత, మెనూ, పరిశుభ్రతపై విద్యార్థులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది శ్రీనివాసులు బిఎల్వోలు. తదితరులు పాల్గొన్నారు




# ఎగువరెడ్డిపల్లి కాలనీ సిమెంట్ రోడ్డు పనుల పరిశీలన

### రూ.10 లక్షల ఐవీఖీ నిధులతో 158 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం

పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:

పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎగువరెడ్డిపల్లి కాలనీలో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులను గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎస్. ప్రవీణ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎగువరెడ్డిపల్లి కాలనీ నుంచి బలిజపల్లి వెళ్లే మార్గం అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా ఐవీఖీ గ్రాంట్ నుంచి రూ.10 లక్షల వ్యయంతో 158 మీటర్ల పొడవున సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్ తెలిపారు. రోడ్డు పనుల పురోగతిని పరిశీలించిన ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో తాగునీటి సమస్యలు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర అంశాలపై ప్రజలు చేసిన వినతులను పరిశీలించారు. తాగునీటికి సంబంధించి ఏ సమస్య తలెత్తినా పంచాయతీ కార్యదర్శి ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే 16వ ఆర్థిక సంఘం నిధులు గ్రామపంచాయతీకి అందిన వెంటనే గ్రామాభివృద్ధికి అవసరమైన మరిన్ని పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని స్పెషల్ ఆఫీసర్ ఎస్. ప్రవీణ్ తెలిపారు.





# అనారోగ్యంతో బాధపడుతున్న పవన్‌కు టీడీపీ యువ నాయకుడు డాక్టర్ నవీన్ కుమార్ ఆర్థిక సహాయం

రాజంపేట (ప్రజా సీమ):

అనారోగ్యంతో బాధపడుతున్న నూనెవారిపల్లె రోడ్డులో నివసించే రాజా కుమారుడు పవన్‌కు రాజంపేటకు చెందిన ప్రముఖ దంత వైద్యుడు, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు డాక్టర్ నవీన్ కుమార్ మంగళవారం సాయంత్రం ఆర్థిక సహాయం అందించారు. పవన్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న డాక్టర్ నవీన్ కుమార్ రూ.10,000 నగదు, డ్రై ఫ్రూట్స్‌తో పాటు డెంటల్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తరిగొపుల లక్ష్మీనారాయణ, బాసినేని వెంకటేశ్వర్లు నాయుడు, గండికోట గుల్జార్ భాషా, ఇస్మాయిల్, కమల్ భాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ, "పవన్‌కు ఉడతాభక్తిగా నా వంతు సహాయం అందిస్తున్నాను. భవిష్యత్తులో కూడా నా వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తాను" అని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సహాయం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పవన్ కుటుంబ సభ్యులు డాక్టర్ నవీన్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



# ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం

రాజంపేట (ప్రజా సీమ):

తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'డోర్ టు డోర్' కార్యక్రమంలో భాగంగా రాజంపేట మున్సిపాలిటీలోని ఏబీఎన్ఆర్ కాలనీ, హైదర్ నగర్, శాంతి కాలనీలలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఆయా కాలనీల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. అర్హత ఉన్నప్పటికీ ఏవైనా సంక్షేమ పథకాలు అందని వారు సంబంధిత ప్రభుత్వ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ డి. నవీన్ కుమార్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, టౌన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి రెడ్డి నాయుడు, యూనిట్ అధ్యక్షుడు చంద్రమౌళి, మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయుడు, బూత్ అధ్యక్షుడు అంజిబాబు, ఆచారి, చంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# భారతీయ జనతా పార్టీలో యువతకు రాజకీయ ప్రాధాన్యత

### - బీజేపి యువ మోర్చా తిరుపతి జిల్లా ఇంచార్జ్ శ్రీనివాస్

మదనపల్లె (ప్రజా సీమ) :

భారతీయ జనతా పార్టీకి యువతే ప్రధాన బలమని బీజేపీ యువ మోర్చా తిరుపతి జిల్లా ఇంచార్జ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ఇంఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మంగళవారం అన్నమయ్య జిల్లా యువ మోర్చా ఆధ్వర్యంలో శ్రీనివాస్ ని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీజేపీ యువ మోర్చా నాయకులు శ్రీకాంత్, భాను, రమేష్, నాగరాజు, మూడే పిల్లస్వామి నాయక్, రెడ్డి శేఖర్, రవితేజ, నవీన్, బాలాజీ, అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లా యువ మోర్చా ఇంఛార్జిగా శ్రీనివాస్ ఎంపిక శుభపరిణామమన్నారు. యువతను మరింత చైతన్యవంతం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ బిజెపిలో యువతకు రాజకీయంలో అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత పాత్ర క్రియాశీలకమన్నారు. తనను సన్మానించిన అన్నమయ్య జిల్లా యువ మోర్చా విభాగానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.



# దాతలకు జిల్లా ఎస్పీ ప్రశంసలు

### - శాలువ కప్పి ఘన సత్కారం

వేంపల్లె ప్రజాసీమ:


దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, ఇతరత్రా నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా కోసం సీసీ కెమెరాల ఏర్పాటు దాతలకు జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ప్రశంసలు అందించారు. ఈ సందర్భంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ని ప్రారంభించిన అనంతరం సభా ముఖంగా దాతలను శాలువతో ఘనంగా సత్కరించారు. ప్రజల బద్రతకు, నేరాల నియంత్రణకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు దాతలు సీసీ కెమెరాలను విరాళం అందించడం హర్షణీయం అని ఎస్పీ కొనియాడారు.




# కోన ప్రభుత్వ పాఠశాలకు లయన్ శ్రీనివాసులురెడ్డి రూ.50 వేల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

కలకడ ప్రజాసీమ:

కోన మాజీ సర్పంచ్ లయన్ బరకం శ్రీనివాసుల రెడ్డి మనువడు వేద సంహిత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కోన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తాగునీటి సమస్యను గుర్తించి, రూ.50 వేల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. రెడెప్ప సమక్షంలో ఈ ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం పట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ డీసీ మెంబర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, లయన్ కాంతారావు, లయన్ హరినాథ్ నాయుడు, లయన్ రెడ్డి శేఖర్, లయన్ పి.వి. నాయుడు, లయన్ నాగ శేఖర్ రెడ్డి, లయన్ భరత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లాలో నిఘా పెంచిన పోలీసులు

### - రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం

మదనపల్లె (ప్రజా సీమ) :

శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తూ జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ రాత్రివేళల్లో పోలీసులు ప్రత్యేక నిఘా, గస్తీని ముమ్మరం చేశారు. నేరాల నివారణ, రోడ్డు భద్రత కోసం వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలతోపాటు వాహనదారులు క్షేమంగా గమ్యం చేరేలా పేస్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు. రాత్రిపూట సంచరించే అనుమానితుల వేలిముద్రలు సేకరిస్తూ, సరిహద్దులతో పాటు ఏటీఎంలు, దేవాలయాలు, నివాస ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.







# కోటగుడిబండలో ఎస్ఐఆర్ నోటీసులపై ఓటర్ల విచారణ

కలకడ ప్రజాసీమ:

కలకడ మండలం కోటగుడిబండ గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ స్టేషన్--50లో ఓటర్లకు జారీ చేసిన ఎస్ఐఆర్ నోటీసులపై విచారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ విచారణకు డిప్యూటీ ఎంపీడీఓ (అదనపు ఏఈఆర్ఓ) హాజరై ఓటర్ల నుంచి వివరాలను స్వీకరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల్లో గుర్తించిన అంశాలు, నోటీసులకు సంబంధించిన విషయాలను పరిశీలిస్తూ అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టారు. నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరై తమకు సంబంధించిన అవసరమైన వివరాలు, ఆధారాలను సమర్పించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు, అభ్యంతరాలు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించుకుని, ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కోటగుడిబండ గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ స్టేషన్--50లో జరిగిన ఈ విచారణ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొని ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని అందించారు.




# ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్

## రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.




# డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు

అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ.85 కోట్ల వసూళ్లను సాధించి, రూ.100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.




# అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవు తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే ఈ సినిమాలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమాలో 'మల్లెపూల పల్లకి బంగారు పల్లకి' అంటూ సాగే పాటలో రామ్ చరణ్ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తారని.. కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై రామ్‌చరణ్ టీమ్ తాజాగా స్పందించింది. అవి రూమర్స్ అంటూ ఖండించింది. అసత్యాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేసింది.




# సంక్రాతి బరిలో మెగా 158 మూవీ

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బ్జడెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్- శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి




# నిధి అగర్వాల్ కొత్త సినిమా


## ఈసారి ఏకంగా మైథలాజికల్ థ్రిల్లర్!

**వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న సినిమా**

**సినిమాకు శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం**

**హీరోయిన్ ప్రధానంగా సాగే కథ**


హీరోయిన్ నిధి అగర్వాల్ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈసారి ఆమె ఓ విభిన్న కథతో అలరించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం మైథలాజికల్ థ్రిల్లర్‌గా రోయిన్ ప్రధానంగా సాగే ఈ కథలో ఆమె ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.



# జీ5లో స్ట్రీమింగ్ కానున్న జననాయకుడు

## కోలీవుడ్ స్టార్ హీరో, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు'

డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ పొలిటికల్ థ్రిల్లర్ సినిమా త్వరలోనే ఓటీటీ ప్రేక్షకులను అలరించనుంది. సెన్సార్ సమస్యలు మరియు వివిధ కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎట్టకేలకు జూలై 23న థియేటర్లలో విడుదలైంది. థియేట్రికల్ రన్ పూర్తి చేసుకున్న ఈ మూవీని ప్రముఖ డిజిటల్ ఎ÷–లాట్‌ఫామ్ జీస్టు 21వ తేదీ నుంచి ఈ సినిమా ధికారిక వెల్లడించారు మేకర్స్. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ భాషలలో ఒకేసారి ఈ డిజిటల్ ప్రీమియల తర్వాత స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో పూజా హెగ్డే, మమిత బైజు, బాబీ డియోల్, ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విజయ్ కెరీర్‌లో చివరి సినిమా కావడంతో పాటు థియేటర్లలో ఈ చిత్రాన్ని మిస్సయిన అభిమానులు ఓటీటీలో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# ముంబైలో తన ఆస్తులపై అమితాబ్ భారీ సంపాదన..

# అద్దె రూపంలోనే కోట్ల ఆదాయం

**ముంబైలో తన కమర్షియల్ స్పేస్‌ను లీజుకిచ్చిన బిగ్ బీ**

**నెలకు రూ. 33 లక్షల అద్దెతో భారీ ఒప్పందం**

**ఐదేళ్ల కాలానికి రూ. 21 కోట్లకు పైగా ఆదాయం**

**గతేడాది కూడా ఇదే బిల్డింగ్‌లో మరో కంపెనీకి లీజు**



Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma